ఓం అన్నపూర్ణాదేవియే నమః

పామర్రు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మూడో రోజు బుధవారం పలు ఆలయాల్లోని అమ్మవార్లను కాశీ అన్న పూర్ణాదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. బుచ్చమ్మ ఆశ్రమంలోని పర్వత వర్ధనీదేవి ఆలయం, అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించి పూజించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని మంగళగౌరిగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో సామూహిక కుంకుమ పూజ చేయించారు. సోమేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. ఆలయంలో వచ్చినభక్తులకు అన్ని వసతులు కల్పించామని ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు బి జాలయ్య, మానేపల్లి రఘురాం, వరదా అప్పారావు, కోటి పాండురంగారావు, సాయి బాబు, శ్రీనివాసరావు, మణికంఠ, బాలు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: దసరా నవరాత్రుల్లో భాగంగా వేమవరం శ్రీ కొండలమ్మ తల్లితో పాటు అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో అమ్మవార్లు శ్రీ కాశీ అన్న పూర్ణాదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారు ధైర్యలక్ష్మీ దేవిగానూ, కొత వరం శ్రీ గంగా పార్వతీ సమేత గౌతమేశ్వరాలయంలో అమ్మవారు శ్రీ లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): దసరా వేడుకల్లో భాగంగా కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నవ (బాల) కుమారి, సువాసిని తదితర పూజలు నిర్వహించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని పలు ఆలయాల్లో దేవీ శరన్నరాత్రుల మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు గూడూరు హనుమశ్శాస్త్రి, భవానీశంకర్ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

ముదినేపల్లిలో.

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ఆలయాల్లో దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు ప్రధానంగా గాయత్రీదేవీతో పాటు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దేవపూడి విజయదుర్గాంబ ఆలయంలో దాసరి భగవాన్‌దాసు ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రీదేవీగా అలంకరించారు. చిన్నకామనపూడి మహంకాళేశ్వరస్వామి, గురజ, పెదకామనపూడి రామలింగేశ్వరస్వామి తదతర ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.


గుడివాడలో..

గుడివాడ టౌన్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని వివిధ ఆలయాల్లో బుధవారం అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. స్థానిక వాసవి చౌక్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవిగా, జగన్నాధపురంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారిని శ్రీధైర్యలక్ష్మీదేవిగా, వేణుగోపాల స్వామి దేవస్థానంలో శ్రీ రాజ్యలక్ష్మి దేవిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు


పామర్రులో కాశీ అన్నపూర్ణాదేవిగా పర్వతవర్ధనీ దేవి


పామర్రులో మంగళగౌరిగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు


వేమవరంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ


దేవపూడి విజయదుర్గాంబ ఆలయంలో గాయత్రీదేవీగా అమ్మవారు


కూచిపూడిలో అన్నపూర్ణదేవిగా..

కొండలమ్మ సన్నిధిలో ఆధ్యాత్మిక కళ


సామూహిక పూజలో ఈఓ కొండలరావు, చైర్మన్ మోహన్, రామరాజు దంపతులు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం దసరా నవరాత్రులను పురస్కరించుకుని బుధవారం ఆధ్యాత్మిక కళతో నిండిపోయింది. శ్రీ అమ్మవారికి సహస్రనామార్చన, సమస్త వ్యవసాయాభివృద్ధి, వ్యాపారాభివృద్ధికి, శ్రీ సుదర్శన, రుద్ర, మూల మంత్ర హవనములను వేద మంత్రోచ్చరణ నడుమ వేద పండితులు నిర్వహించారు. దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్‌రావు, మాజీ సర్పంచ్ కొడాలి రామరాజు, దేవస్థాన సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు నీరాజనాలు


కైకలూరు శ్యామలాంబ ఆలయంలో చండీ మహాయాగం


లోకుమూడి దత్తాశ్రమంలో దసరా పూజలు

కైకలూరు: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీశ్యామలాంబ, వాసవీ కన్యకాపరమేశ్వరీ, ఆటపాక, గోనెపాడు ఆలయాల్లో కనకదుర్గా అమ్మవార్లు అన్నపూర్ణాదేవీగా నీరాజనాలు అందుకున్నారు. కై కలూరు శ్యామలాంబ ఆలయంలో ఈఓ వీఎన్‌కే.శేఖర్ ఆధ్వర్యంలో చండీ మహా యాగం నిర్వహించారు. గీతాపారాయణం, కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకున్నాయి. లోకుమూడిగురువు దత్తాశ్రమంలో కోటి కుంకుమార్చన నిర్వహించారు. అన్నపూర్ణ దేవీని భక్తులు పూజించారు. కొండ్రెడ్డి ప్రభాకర్ ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. న్యాయవాదులు గురజాడ ఉదయశంకర్, గొర్తి ప్రభాకర దీక్షితులు, నిర్వాహకులు కురెళ్ల మురళీకృష్ణ, రాగాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కైకలూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో కామాక్షీ దేవీ శరన్నవరాత్రుల్లో అముదాలపల్లి వీరబ్రహ్మం, పద్మావతి దంపతులు పూజలు చేశారు. పెద్దింట్లమ్మ దేవస్థానంలో ఈఓ కూచిపూడి శ్రీనివాసు ఆధ్వర్యంలో అమ్మవారికి ఆవరణ పూజ చేశారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధిగా కిరణ్



గుడివాడ టౌన్ : పట్టణానికి చెందిన మెండా కిరణ్‌కుమార్ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ అయిన ఎస్సీ సెల్ అధికార ప్రతినిధిగా నియమితులైనట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుక్కిపాటి శశిభూషణ్ తెలిపారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని మెండా కిరణ్ తెలిపారు.

కనులపండువగా నృత్య ప్రదర్శనలు



గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా ఉత్సవాల సందర్భంగా బుధవారం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఈ నృత్య ప్రదర్శనలు మానసికోల్లాసాన్ని కలిగించాయి.

నైపుణ్యాభివృద్ధికి ఒకేషనల్ విద్యా కోర్సులు



పమిడిముక్కల: తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఒకేషనల్ కోర్సులకు సంబంధించి బుధవారం ఇంటర్న్‌షిప్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్రికల్చర్, ఆటోమొబైల్ కోర్సులపై దసరా సెలవుల్లో 10 రోజులపాటు ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నట్లు ఒకేషనల్ ట్రైనర్స్ వెంకన్నబాబు, ఈశ్వరి తెలిపారు. ఆటోమొబైల్ కోర్సుకు సంబంధించి స్థానికంగా ఉన్న బైక్ మెకానిక్, స్పేర్ పార్ట్స్ దుకాణాలకు విద్యార్థులను తీసుకెళ్లి అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ కోర్సుకు సంబంధించి ఎరువులు, పురుగుమందుల షాపులకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. ఒకేషనల్ విద్యా కోర్సుల సర్టిఫికెట్లు ఉన్నత చదువులకు ఉపయోగపడతాయని హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జీసీడీఓ సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయుడు రవికుమార్ పాల్గొన్నారు.

అదనపు నైపుణ్య కోర్సు నిర్వహణ



గుడ్లవల్లేరు: స్థానిక వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల్లో ఇంగ్లిష్ ఫర్ కెరీర్ డెవలప్‌మెంట్ అనే అంశంపై అదనపు నైపుణ్య కోర్సు నిర్వహణకు సంబంధించి ఈఎల్‌టీ సెంటర్ అధ్యాపక సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం ముగింపు సభను చేపట్టారు. ఈ కోర్సును బీ-ఫార్మసీ నాలుగో సంవత్సర విద్యార్థులకు ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రామానుజన్ పార్థ సారథి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ముఖ్య అతిథిని సత్కరించారు. కోర్స్ ఇన్‌స్ట్రక్టర్స్‌కు ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో కార్యక్రమ కో-ఆర్డినేటర్ బి.సుష్మశ్రీ, కోకన్వీనర్ కే పరిమళ, కోర్స్ ఇన్‌స్ట్రక్టర్స్ పీ పాల్ ఫ్రాన్సిస్, జే జయప్రకాష్, డాక్టర్ బి.నాగరాజ, పి.రాజుకిరణ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు

మండవల్లి: రైల్వే గేట్ మరమ్మతుల కారణంగా (ఎల్‌సీ 79) కైకలూరు-గుడివాడ రోడ్డు గేట్ మూత పురస్కరించుకుని 24 నుంచి 30 వరకు వాహనదారులు దారి మళ్లించి వెళ్లాలని పోలీసులు బుధవారం తెలిపారు. ముదినేపల్లి నుంచి కైకలూరు వచ్చే వాహనదారులు ముదినేపల్లి-సింగరాయపాలెం-కోరుకొల్లు మార్గం ద్వారా కైకలూరుకు చేరుకోవాలన్నారు. కైకలూరు నుంచి గుడివాడ వెళ్లే వాహనదారులు కై కలూరు మార్కెట్‌యార్డు-కోరుకొల్లు-సింగరాయపాలెం మార్గం ద్వారా గుడివాడకు వెళ్లాలని తెలిపారు. ఏలూరు-గుడివాడ వెళ్లే వాహనదారులు కైకలూరు మార్గం ఉపయోగించకుండా దెయ్యంపాడు-మండవల్లి మార్గం ద్వారా గుడివాడకు చేరాలని పేర్కొన్నారు.

ప్రత్యేక వైద్యశిబిరం

మండవల్లి: స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్య శిబిరాల్లో భాగంగా పెరికెగూడెంలో బుధవారం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. 195 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నంశెట్టి నందకిషోర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.


గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఉదయం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్ వర్క్

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ఎందుకు ఆహ్వానించరు?


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోగం సురేష్

పెదపారుపూడి: స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రజా ప్రతినిధులను, ఎంపీపీని ఎందుకని పిలవడం లేదని రెవెన్యూ అధికారులను ఎంపీపీ గోగం సురేష్ ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విమాదేవి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అధికారులను అంశాల వారీగా పిలిచి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయ డీటీ కె.ఏసుపాదం ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ కార్డుల గురించి వివరిస్తుండగా .. ఎంపీపీ జోక్యం చేసుకుని స్మార్ట్ కార్డుల పంపిణీ చేసేటప్పుడు ప్రజా ప్రతినిధులను ఎందుకు పిలవడంలేదని మండిపడ్డారు. పెదపారుపూడిలో తాగునీటి ట్యాంక్ నుంచి నీళ్లు రావటం లేదని వైస్ ఎంపీపీ పొనుగుమాటి రజిని ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీడీఓ సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి ఈశ్వకి సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు పద్మజ, జాజుల శ్రీనివాసరావు, చిగురుపాటి అశోక్‌కుమారి, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమాజ సేవ చేయడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం


రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం


గుడ్లవల్లేరులో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు

గుడివాడటౌన్: సమాజ సేవ చేయడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు అన్నారు. బుధవారం కళాశాల్లో ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ చేయడంపై విద్యార్థులలో ఆసక్తి పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా కళాశాల ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకం నిరోధించాలని కోరుతూ జూట్ క్యారీ బ్యాగులు ప్రజలకు పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సేవలందించిన రోటరీ క్లబ్ గుడివాడ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావును సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ సతీష్ చంద్ర, కో-ఆర్డినేటర్ జి.జీవన్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సందేశాత్మక లఘు నాటికలను ప్రదర్శించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు తాము చేసిన సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలను, రక్త దానం చేసినందుకు రోటరీ క్లబ్ వారి ధ్రువీకరణ పత్రాలను కళాశాల పరిపాలనా అధికారులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సిద్ధయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండరామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్. శాస్త్రి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి.నవీన్‌కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

100 మందికి వైద్యసేవలు


మందులను అందజేస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్

పామర్రు: స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభ్యాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్యశిబిరం 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. పామర్రు-1 సబ్ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ జీషన్ ఖాన్ ఆధ్వర్యంలో వైద్యసేవలను అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశామని తెలిపారు. పామర్రు సర్పంచ్ కేతావతు కస్తూరి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, సీహెచ్ఓలు దీప్తి, స్టీవెన్ సన్, కుసుమ, తనూజ పాల్గొన్నారు.

రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి


మోట్రు ఏసుబాబు

ముదినేపల్లి రూరల్: జిల్లాలో అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మోట్రు ఏసుబాబు డిమాండ్ చేశారు. ముదినేపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన కౌలు రైతులకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ఇందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించామని ప్రభుత్వం చెబుతుందన్నారు. ఇవి అందాలంటే ప్రతి ఒక్కరికీ సీసీఆర్సీ కార్డులు విధిగా ఉండాలన్నారు. వీటిని జారీ చేసేందుకు వీఆర్వో, తహసీల్దార్ లాగిన్‌లో ఆన్‌లైన్ సైట్ పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నట్లు ఆరోపించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడానికి ఇప్పటికే భూ యజమానులు వెనకడుగు వేస్తుండగా.. ప్రభుత్వం సైతం సీసీఆర్సీ కార్డులు జారీ చేయకపోవడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం కౌలు రైతుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు మాత్రమే అన్నదాత సుఖీభవ పొందడానికి అర్హులని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయమై వెంటనే జోక్యం చేసుకుని అర్హులైన ప్రతీ కౌలురైతుకు సీసీఆర్సీ కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకుని అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని కోరారు.

పీ-4తో బలహీనులకు చేయూత



కైకలూరు: సమాజంలో అట్టడుగు వర్గాలకు పీ-4 ఆలోచనా విధానంతో పేదరికం తగ్గుతుందని ఎంపీపీ అడవి కృష్ణ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ-4పై గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ సంపన్నులు కొంత భాగం పేదల జీవితాలు మెరుగుపడటానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రామకృష్ణ, ఏఓ కె.బాల శంకర్‌రావు, యంగ్ ప్రొఫెసనల్ కె.స్వరూప్ పాల్గొన్నారు.

వెలవెల బోయిన సర్వసభ్య సమావేశం



మండవల్లి: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు గతంలో ప్రకటించారు. 3.30 గంటలకు కూడా ఒక్క అధికారి కూడా రాలేదు. గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన అధికారులే సమయపాలన పాటించకపోవడంపై పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుడు బెనర్జీకి సాహితీ కిరీటి పురస్కారం

కైకలూరు: శ్రీశ్రీ కళా వేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా కైకలూరు మండలం గోపవరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు దండే బెనర్జీ సాహితీ కిరీటి పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీ భూషణం నుంచి ఎంపిక పత్రం బెనర్జీకి బుధవారం అందింది. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో సృజనాత్మక ప్రతిభ కనబర్చినందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నెల 28న హైదరాబాదు బిర్లా ఆడిటోరియంలో అవార్డును అందించనున్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి


పమిడిముక్కలలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సీతారామరాజు


గుడ్లవల్లేరులో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

పమిడిముక్కల: గర్భిణుల, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సీతారామరాజు సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను కపిలేశ్వరపురం పీహెచ్‌సీ వైద్యులు ఇందు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉష, సలీమున్నీసా, అనిత పోషకాలు కలిగిన పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, ఏపీఎం వెంకటేశ్వర్లు, పీహెచ్ఎన్ ఝాన్సీరాణి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మాసోత్సవాల్లో భాగంగా అనుబంధ పోషకాహారంపై ఐసీడీఎస్ గుడివాడ సీడీపీఓ విజయ ఫ్లోరెన్స్ తల్లులకు బుధవారం అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం పదార్థాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించాలని ఆమె కోరారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. సూపర్‌వైజర్ నసీరున్నీసా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మహిళల్లో పౌష్టికాహారంతోనే ఆరోగ్య సంరక్షణ చేకూరుతుందని బీజేపీ జిల్లా నాయకుడు కోటప్రోలు కృష్ణ అన్నారు. మండలంలోని పేరూరులో స్వస్థ్ నారీ.. సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు


పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఆ పార్టీ 16 నెలల పాలనలోనే ప్రజాగ్రహానికి గురైయిందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ విమర్శించారు. అందుకు నిదర్శనమే ఆ పార్టీని వీడి పలువురు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని తెలిపారు. యలకుర్రు గ్రామానికి చెందిన పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. పామర్రులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి కైలే అనిల్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. చంద్రబాబు అబద్ధపు హామీలు, మోసపు మాటలతో ప్రజలను నిలువునా దగా చేశారని విమర్శించారు. వైఎస్సార్ సీపీపై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. భవిష్యత్‌లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఈ రాష్ట్రానికి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్న ఆకాంక్ష ప్రజలలో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పానే శివ మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

పామర్రు: బలహీన వర్గాల పిల్లలను విద్యాధికులను చేస్తే అభ్యున్నతి చెందవచ్చని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కే రంగారావు పేర్కొన్నారు. బుధవారం రాత్రి విజయవాడ నుంచి పాలకొల్లు వెళ్తూ మార్గ మధ్యంలో పామర్రు వెలమపేట శ్రీరామాలయంలో స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వెలమ సంఘ ప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. వెలమ సంఘ నాయకులు మూడెడ్ల వెంకటేశ్వరరావు, వైకుంఠపు మాధవ, అల్లు సత్యనారాయణ, పృథ్వీరాజు తదితరులు పాల్గొన్నారు.